నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

- గుడ్డం కోనేరు సిద్ధం
- సమన్వయంతో అధికారుల ఏర్పాట్లు

బందోబస్తు ఇలా...

డీఎస్పీలు	10 మంది
సీఐలు	40 మంది
ఎస్‌ఐలు	100 మంది
ఏఎస్‌ఐ, హెచ్‌సీ, పీసీ ఇతర సిబ్బంది	1000 మంది

హిందూపురం: పట్టణంలో శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వినాయక చవితి సందర్భంగా నిర్వాహకులు ఈనెల 7న వినాయక చవితి నుంచి ఏడు రోజుల మండపాల్లో గణనాథులను కొలువుదీర్చి, రోజూ పూజలు చేపట్టి శుక్రవారం మధ్యాహ్నం నుంచి నిమజ్జన కార్యక్రమం మొదలవుతుంది. ఏడురోజులపాటు పురప్రజల నిత్యపూజలు గణపయ్య అందుకుని నిమజ్జనోత్సవానికి పురవీధుల్లో తరలివచ్చి గుడ్డం కోనేరులో నిమజ్జనం జరగనుంది. భారీ గణపతులను వాహనాలపై నుంచి కిందకు దింపించడానికి ఏర్పాటైన స్టేజీలు సిద్ధం చేశారు. స్టేజ్ వద్దకు తరలివచ్చిన గణపతి విగ్రహాలను క్రేన్ ద్వారా నేరుగా కోనేరులో నిమజ్జనం చేయడానికి అనుకూలంగా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కోనేరులో పూర్తిస్థాయిలో నీరు నిండి ఉండటంతో చుట్టూ బారికేడ్లు కట్టారు. అంతేగాక ఎంజీఎం స్కూల్ వైపు నుంచి కోనేరు పక్కకు రావడానికి దారి పక్కన కూడా బారికేడ్లు నిర్మించారు. నిమజ్జనానికి వస్తున్న వినాయకుల విగ్రహాల్లో చిన్న వాటిని పక్కనే చిన్నకోనేరు నిమజ్జనానికి సిద్ధం


వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే గుడ్డం కోనేరు

చేస్తామని అధికారులు చెబుతున్నారు. భారీ విగ్రహాలను మాత్రం పెద్ద కోనేరులో క్రేన్‌ద్వారా నీటిలో వదలడానికి వీలు కల్పించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిమజ్జనం రోజు శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి భారీ వినాయక విగ్రహాల ఊరేగింపు తరలి వెళ్లే చోట్ల విద్యుత్ అంతరాయం కలిగే అవకాశాలు ఉంటాయి. తర్వాత మైన్‌రోడ్డులో కూడా కొంత ఇబ్బంది ఉండవచ్చు. అయితే విగ్రహాలు తరలిన వెంటనే ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలు పునరుద్ధరిస్తామని ట్రాన్స్‌కో డీఈఈ తెలిపారు. సాధ్యమైనంత వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. నిమజ్జనం సమయంలో సరఫరా లేకపోయినా, మరమ్మతులకు అవసరమైన పరికరాలు సిద్ధం చేశారు. ఇప్పటికే భారీ విగ్రహాలను 16 వరకూ గుర్తించి వాటి తరలించే సమయంలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.


కోనేరు వద్ద ఇసుక బస్తాలు, ఇతర ఏర్పాట్లకు సాగుతున్న పనులు

బందోబస్తు చర్యలు చేపడుతున్నాం



హిందూపురం పట్టణంలో శుక్రవారం పెద్ద ఎత్తున సాగుతున్న గణేష్ నిమజ్జనోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. బందోబస్తుతో పాటు ఇతర సదుపాయలు, వసతులపై సంబంధింత శాఖాధికారుల సమన్వయంతో శాంతియుతంగా సాగేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే మున్సిపల్ అధికారులు గుడ్డం కోనేరును శుభ్రం చేసి చుట్టూ బారికేడ్లు, గుడ్డందారిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. కోనేరు వద్ద మధ్యాహ్నం నుంచి తెల్లవారుజాము వరకూ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక క్రేన్‌తోపాటు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. ఊరేగింపు సాగేదారుల్లో గుంతలు పూడ్చివేతలు, లైటింగ్‌తోపాటు పారిశుధ్య చర్యలు చర్యలు మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

– మహేష్, డీఎస్పీ, హిందూపురం

అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన నంబర్లు

	08556 220722
కంట్రోల్ రూం	9440781837, 9441252367
డీఎస్పీ పర్యవేక్షణ కంట్రోల్ రూం	9490398272, 9885737859.
ట్రాన్స్‌కో కంట్రోల్ రూం	9959655179, 9440817270.

క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ


ఇరిగేపల్లిలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ రంగస్వామి

అగళి: మండల పరిధిలోని ఇరిగేపల్లి, మధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈఓ రంగస్వామి గురువారం తనిఖీ చేశారు. ఇరిగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఈ ఓ రంగస్వామి రికార్డులను పరిశీలించారు.

గురుకుల పాఠశాలల సందర్శన


వైద్య సేవలను పరిశీలిస్తున్న డీసీఓ మురళీకృష్ణ

అమరాపురం: మండంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలను ఉమ్మడి అనంతపురం గురుకుల పాఠశాల డీసీఓ మురళీకృష్ణ పరిశీలించారు. గురువారం హలుకూరు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు విషజ్వరాలు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. హేమావతి, అమరాపురం పీహెచ్‌సీ వైద్యులు మనోహర్‌నాయక్, భార్గవ్‌తో పాటు సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ 1 రాఘవయ్య, ప్రిన్సిపాల్ పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

లేపాక్షి: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఇటీవల పుట్టపర్తిలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషగిరిబాబు, అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు పీఎస్.ప్రసాద్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించండి

అమరాపురం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలను వెల్ఫేర్ అసిస్టెంట్లు సందర్శించాలని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు.

పంచాయతీలకు ట్రాక్టర్ల మంజూరు


ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితర అధికారులు

మడకశిర: నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయతీలకు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ట్రాక్టర్లను గురువారం కేటాయించారు. నియోజకవర్గంలోని దాదాపు 30 గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు వచ్చాయి. ఈట్రాక్టర్లను పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పంపిణీ చేశారు. అతర్వాత పట్టణంలో ఈట్రాక్టర్లతో ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణకు ఈట్రాక్టర్లను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అగళి జెడ్పీటీసీ ఉమేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసమూర్తి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు,5 మండలాల ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

పావగడ: కేరళ రాష్ట్రం వయనాడు జిల్లాలోని వరదబాధితులకు స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానంద జీ నేతృత్వంలో మూడో విడత నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి గురువారం తరలించారు. స్థానిక రామకృష్ణాశ్రమం లో ఆశ్రమ భక్తులు, బ్రైట్ ఫ్యూచర్ సంస్థ స్వయం సేవకులు సిద్ధం చేసిన నిత్యావసర కిట్లు, బకెట్లు, దుప్పట్లు, వంట సామగ్రి తదితర ఆహార పదార్థాలను లారీలో తరలించారు.

విరాళాల సేకరణ

గోరంట్ల: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో విరాళాలు సేకరించారు. స్థానిక గుమ్మయ్యగారిపల్లి కుడలి నుంచి విజయకుమార్ పెట్రోల్ బంక్ వరకు ప్రధాన రహదారిలో ఉన్న వ్యాపార సముదాయాల్లో భిక్షాటన చేపట్టారు. మొదటి రోజు రూ.15,300 విరాళాలు సేకరించినట్లు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వర్ణలత, కేవీపీఎస్ అధ్యక్షుడు హనుమయ్య, నాయకులు నార్శింపల్లి ఆంజనేయులు, సాకే వెంకటేశులు, ముత్యాలప్ప, భాస్కర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

మడకశిరరూరల్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మైసూరుకు చెందిన (బీపీసీఎల్) టెరిటోరీ మేనేజర్ (రిటైల్) విక్రాంత్ హట్ తెలిపారు. గురువారం నీలకంఠాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పెద్దనాన్న స్వర్గీయ శ్రీరామరెడ్డి 119 జయంతి సందర్భంగా నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆయన క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని, వారితో గౌరవ వందనం స్వీకరించారు. శ్రీరామరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించారు. సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఈటోర్నీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. శ్రీరామరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, సేవామందిరం విద్యాసంస్థల అధినేత కేటీ శ్రీధర్, పీఈటీలు, ఉపాధ్యాయులు, క్రీడకారులు, నాయకులు పాల్గొన్నారు.


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న దృశ్యం

కెమిస్ట్రీ ల్యాబ్ భవనాన్ని పూర్తి చేయండి

రొళ్ల: కెమిస్ట్రీ ల్యాబ్ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీధర్ కోరారు. గురువారం మండలంలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో సీఎం శ్రీ కింద మంజూరై నిర్మాణ దశలో ఉన్న కెమిస్ట్రీ ల్యాబ్‌ను పరిశీలించారు. ఎస్ఏ-1 పరీక్షలో విద్యార్థుల ప్రగతితో పాటు వాటి మూల్యాంకన పత్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మైలారప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

అగళి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా పోటీల్లో బాలుర భాగంలో 30 మంది, బాలిక విభాగంలో 20 మంది ఎంపికైనట్లు పీఈటీ నారాయణస్వామి తెలిపారు. అండర్14, అండర్ 17 మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి.

ఎయిడ్స్‌పై అవగాహన

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఫోర్డ్ సంస్థ ప్రతినిధులు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ , నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఫోర్డ్ సంస్థ మేనేజర్ అశ్వత్థనారాయణ, సంస్థ సిబ్బంది లలిత, నాగేశ్వరి, ప్రిన్సిపాల్ మహేష్, ఎన్ఎస్ఎస్ పీఓలు శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

సీతారం ఏచూరి మృతికి రఘువీరా సంతాపం

మడకశిర: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మృతి పట్ల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి గురువారం ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఆయన మృతి దేశానికి తీరని లోటన్నారు. దేశం ఒక కమ్యూనిస్టు యోధుడిని కోల్పోయిందని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

పైప్‌లైన్, డ్రిప్ పరికరాల ధ్వంసం

గోరంట్ల: మండల పరిధిలోని దిగువ గంగంపల్లికి చెందిన రైతులు రమేష్, అతని సోదరుడు రంగస్వామి (టీడీపీ మద్దతుదారులు) వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌తో పాటు డ్రిప్ ల్యాటర్‌ను బుధవారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారు. దాదాపు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేయాలని అధికారులకు సూచించామన్నారు. మరో టీడీపీ వర్గం వారు కొంతమంది రైతుల పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేయొద్దని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారని పేర్కొన్నారు. బుధవారం రాత్రి గ్రామానికి చెందిన సున్నపరాళ్ల రామకృష్ణ, మంగలి రాము గొడవకు వచ్చినట్లు తెలిపారు. వీరే పైపులు, ల్యాటర్ ధ్వంసం చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఘనంగా నిమజ్జనం


మరవకొత్తపల్లిలో వినాయకుడి విగ్రహం ఊరేగింపు


పరిగి మండలంలోని కొడిగెనహళ్లిలో నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుడు


రొద్దం: వినాయక విగ్రహం వద్ద నృత్యం చేస్తున్న విద్యార్థులు

చిలమత్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు కొనసాగుతున్నాయి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి భద్రతాచర్యలు చేపట్టారు.

రొద్దం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 21 అడుగుల మట్టి గణపయ్య మండపం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పరిగి: వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కొడిగెనహళ్లి, పరిగి, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేపట్టి, ట్రాక్టర్లలో నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రంగడుయాదవ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

పరామర్శ

పరిగి: మండలంలోని బీచిగానిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న వంగలపల్లి గ్రామానికి చెందిన శ్రీరామరెడ్డి కుమారుడు లోకనాథ్‌రెడ్డి (20) గురువారం వేకువజామున అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, పుట్టపర్తి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

మణూరుతండాలో వైద్యశిబిరం

మడకశిరరూరల్: మండలంలోని మణూరు తండా గ్రామంలో విష జ్వరాలతో బాధపడుతున్న వారికి కల్లుమర్రి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది గురువారం వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. 'సాక్షి'లో ఇటీవల 'మంచపట్టిన మణూరు తండా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన వైద్యసిబ్బంది, పంచాయతీ అధికారులు తండాలో పర్యటించారు. వైద్య సిబ్బంది తండాలో విష జ్వరాలపై ఇంటింటా సర్వే చేసి, రక్త పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు కూడా చికిత్సలు అందించారు. జర్వాలతో బాధపడుతున్న ఏడుగురిని గుర్తించి, వారికి వైద్య చికిత్సలు అందించారు. గ్రామ కార్యదర్శి ఆనంద్‌కుమార్ కార్మికులతో మురుగు కాలువలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ వేయించారు. కార్యక్రమంలో డాక్టర్లు మాధుర్య, వినోద్‌కుమార్, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హుస్సేన్‌బీ, ఏఎన్ఎం రాజేశ్వరి,ఎంఎల్‌హెచ్‌పీ స్రవంతి, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తండాలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్: పట్టణంలో శుక్రవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం ఉండటంతో ప్రధాన వీధులతో పాటు గణేష్ విగ్రహాలు తరలే మెయిన్ బజార్, పెనుకొండ రోడ్డు, వాసవీ ధర్మశాల రోడ్డు, బెంగళూరు రోడ్డు, ఎంఎఫ్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం వెళ్లే దారి గుడ్డం వరకు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మారుస్తున్న నేపథ్యంలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ భూపతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే విద్యుత్ స్తంభాలు ఉన్న చోట, ఇళ్లపై వైర్లు దగ్గరగా ఉన్న చోట తగు జాగ్రత్తలు తీసుకుని గణేష్ విగ్రహలు తొలగించాలన్నారు. నిమజ్జనంలో అపాయకర పరిస్థితులు ఏర్పడినా,, తెలిసినా వెంటనే 9440781837 అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

గోరంట్ల: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కోరేవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు రాధను గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మండల గోపాల్, జాన్‌రెడ్డప్ప, మండల ఉపాధ్యాయ సంఘం నాయకులు, పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ సర్వేయర్ కోర్సు, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకోర్సులలో నేర్చుకోవడానికి

సంక్షిప్త సమాచారం

10వ తరగతి పాస్ లేదా ఆపై చదివిన వారందరూ అర్హులన్నారు. ఆసక్తి కల్గిన యువతీ యువకులు ఆధార్ జిరాక్స్ కాపీతోపాటు మొబైల్ నెంబరు నమోదు చేసి దరఖాస్తు ఇవ్వాలన్నారు. నాలుగు నెలలు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి కల్గినవారు ప్రభుత్వ పాలిటెక్నిక్ స్కిల్ హబ్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

యువతి అదృశ్యం

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లి తండాకు చెందిన శంకరనాయక్ కుమార్తె శశికళ బాయి ఈనెల 10వ తేదీన అదృశ్యమైంది. బూదిలి సమీపంలోని ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్న శశికళ బాయి పరిశ్రమకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. తండ్రి శంకరనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బోయ శేఖర్ తెలిపారు.

ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తులు తీసుకోవాలి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లు, భవనాలు నిర్మాణానికి దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇళ్లు, భవనాల నిర్మాణానికి నింబధనల మేరకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

సోమందేపల్లి: మండల కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్ వద్ద గురువారం రాత్రి రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. రొద్దం మండలం గొబ్బరం పల్లి నుంచి ఇసుకను తరలిస్తుండగా ఎస్ఐ రమేష్ బాబు పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వక్ఫ్‌బోర్డ్ చట్టాలను సవరించండి

పావగడ: కేంద్ర ప్రభుత్వ వక్ఫ్ బోర్డుకు సంబంధించిన 40 చట్టాలను సవరించాలని స్థానిక శ్రీరామ సేన కార్యకర్తలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అతిథి గృహంలో నిర్వహించిన సంతకాల సేకరణ అభియాన ప్రక్రియ కార్యక్రమంలో జిల్లా శ్రీరామసేన సంస్థ అధ్యక్షుడు అనిల్ యాదవ్ మాట్లాడుతూ, హిందువులందరూ సంతకాల సేకరణలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరామసేన జిల్లా ఉపాధ్యక్షుడు రాము, ట్రెజరర్ జితేంద్రబాబు, కార్తీక్, వాసు, స్వరూప్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక నగదు అందజేత

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులకు విశ్రాంత హెచ్‌ఎం వీరాంజనేయులు కుటుంబ సభ్యులు గురువారం రూ.500 చొప్పున ప్రోత్సాహక నగదు అందజేశారు. ఐదవ తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించడంతో వారిని అభినందిస్తూ నగదు అందజేశారు. హెచ్‌ఎం లక్ష్మీబాయి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, నాగరాజు, శ్రీనివాసులు, గోవిందరప్ప తదితరులు పాల్గొన్నారు.

వినాయకా.. వరములివ్వు


నింకంపల్లిలో హనుమంతుడితో ధనుస్సుధారి గణపతి


పలశేనగర్‌లో గణపతి, కుమారస్వామితో పార్వతీదేవి


గదాధాని గణేష్


నింకంపల్లిలో..

హిందూపురం: పురంలో వినాయక చవితి పండగ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గురువారం ఆరో రోజూ గణపతి విగ్రహాలు కొలువైన మండపాల వద్ద పూజలు, హోమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేసి అన్నదానాలు నిర్వహించారు.

గుడ్డం కోనేరు వద్ద ఏర్పాట్ల పర్యవేక్షణ


గుడ్డం కోనేరు వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, అధికారులు

హిందూపురం : పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జన సందర్భంగా గుడ్డం కోనేరులో మున్సిపల్ అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి పరిశీలించారు. కోనేరు వద్ద నీటి వసతి, బారికేట్లు, ఇరువైపులా వీధిలైట్లు సిబ్బంది పర్యవేక్షణ, పనితీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. కోనేరు వద్ద ఎలాంటి ఇబ్బందిలేకుండా మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న జడ్జి ఆర్.అశోక్‌కుమార్

మడకశిర: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఆర్. అశోక్ కుమార్ తెలిపారు. గురువారం కోర్టు ఆవరణలో లీగల్ లిటరసీ క్యాంప్ జరిగింది. ఈ క్యాంప్‌లో జడ్జి చట్టాలపై వివరించారు. చట్టాలపై అవగాహన పెంచుకుంటే కొన్ని అంశాల్లో నష్టపోవడానికి అవకాశం ఉండదని తెలిపారు. కొందరు చట్టాలపై అవగాహన లేక పోవడంతో పలు రకాలుగా నష్టపోతున్నారన్నారు. సివిల్, క్రిమినల్ చట్టాలను తెలుసుకోవాలన్నారు. మహిళలు, బాలలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. ఈ క్యాంప్‌లో న్యాయవాదులు గోపీనాథ్, దివాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ చోరీ

చిలమత్తూరు: మండలంలోని కోడూరు థామస్‌మన్రో తోపులో ఉన్న వన్ ఫేజ్ 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ చోరీకి గురైనట్టు జేఎల్ఎం బాషా గురువారం తెలిపారు.బుధవారం అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగి ఉంటుందన్నారు. సుమారు రూ.40 వేలు విలువ చేసే వైర్‌తోపాటు ఆయిల్ కూడా ఎత్తుకెళ్లారన్నారు.

గుండె పోటుతో ఉద్యోగి మృతి


ఉల్లాస్ (ఫైల్)

పావగడ: స్థానిక వ్యవసాయశాఖ ఉద్యోగి ఉల్లాస్ (39) గుండె పోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక వ్యవసాయశాఖలో ఎఫ్‌డీఏగా ఉద్యోగం చేస్తున్న ఉల్లాస్ స్వగృహంలో గుండె నొప్పి వచ్చి మృతిచెందాడు. మృతుడికి భార్య చంద్రిక, ఐదేళ్ల కుమార్తె ఉంది. అతని మృతి పట్ల స్థానిక వ్యవసాయశాఖ ఏడి అజయ్ కుమార్, ఏఓ వేణు, దయానంద్, అశోక్, షంషద్ తదితర సిబ్బంది, స్థానిక వాల్మీకి సంఘం నాయకులు సంతాపం తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

పెనుకొండ: పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు హరి, బాబావలి తదితరులు కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. డ్రైనేజ్, సీసీ రోడ్లు, వీధి లైట్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే కాలనీలో సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, మహబూబ్ బాషా, రాజారావు కాలనీవాసులు నారపరెడ్డి, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.